క్లుప్తంగా

రహదారికి అడ్డంగా నిలిచిన ఇసుక ట్రాక్టర్



జూపూడి(ఇబ్రహీంపట్నం): జూపూడి సమీపంలో ఇసుక క్వారీ నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ టైర్ పగిలి రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. పెదలంక గ్రామానికి సమీపంలో బుధవారం జరిగిన ఈ ఘటనతో పెదలంక గ్రామానికి రెండు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. ఇరుకు రోడ్డులో కనీసం బైక్ వెళ్లేందుకు కూడా దారి లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఆటోల్లో వ్యవసాయ పనులకు వెళుతున్న కూలీలకు దారి లేక ఆటోలు దిగి నడుచుకుంటూ వెళ్లాల్సి వచ్చింది. రెండు గంటల తర్వాత ట్రాక్టర్‌లోని ఇసుక అక్కడే అన్‌లోడ్ చేసి ట్రాక్టర్‌ను జేసీబీతో తరలించారు.

డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థులకు స్వర్ణ పతకాలు



తిరువూరు: ఒంగోలులో ఈ నెల 2న నిర్వహించిన రాష్ట్ర స్థాయి చిత్రలేఖన పోటీల్లో తిరువూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు ఏడు బంగారు పతకాలు సాధించారు. ఒంగోలు సృష్టి ఆర్ట్ అకాడమీ నిర్వహించిన ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను బుధవారం పాఠశాల ప్రిన్సిపాల్ కోటిరెడ్డి అభినందించారు. డ్రాయింగ్ ఉపాధ్యాయులు వెంకటరావుకు, పాఠశాలకు కూడా నిర్వాహకులు అవార్డులు అందజేశారని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులను పలువురు అభినందించారు.

ఉపాధ్యాయుల శిక్షణ సమయం కుదించాలి

డీపీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీను



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణ సమయాన్ని కుదించాలని డెమోక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను డిమాండ్ చేశారు. గుంటుపల్లి జెడ్పీ పాఠశాలలో డీ పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బుధవారం నిర్వహించారు. పలువురికి సభ్యత్వాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల శిక్షణ సదస్సు ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించడం వలన 50 ఏళ్లు పైబడిన వారు ఒత్తిడికి గురవుతున్నారన్నారు. శిక్షణ సమయంలో పీహెచ్‌సీ వైద్యుడితో కూడిన వైద్య బృందం అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. మండల శాఖ అధ్యక్షురాలు బి.ఆదిలక్ష్మి, జిల్లా కార్యదర్శులు కె.వెంకటేశ్వర్లు, వి.లాల్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వాగు కల్వర్టు



చాట్రాయి: మండలంలోని చిత్తపూరు కమ్మటూరు చెరువు వాగు కల్వర్టుకు ఇరువైపులా రెయిలింగ్ లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఈ కల్వర్టు మీదుగా విద్యార్థులు, ప్రజలు నడుచుకుంటూ వెళుతుంటారు. పశువులు, జీవాలు నిత్యం ఈ కల్వర్టు మీదుగా వెళుతుంటాయి. వరద వచ్చినపుడు నీటి ప్రవాహానికి ప్రజలు కాలువలో పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టుకి ఇరు వైపులా రెయిలింగ్ ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై ఫిర్యాదు

తిరువూరు: స్థానిక బస్టాండ్ సెంటర్లోని మద్యం దుకాణం వద్ద బహిరంగంగా మద్యం సేవిస్తుండటంతో తాము ఇబ్బందులు పడుతున్నామని ఆ ప్రాంత మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి వేళల్లో మద్యం సేవించిన ఆకతాయిలు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, మద్యం దుకాణం వద్ద అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని వారు కోరారు. తిరువూరు సెక్టార్–1 ఎస్‌ఐ సత్యనారాయణ మద్యం దుకాణం వద్ద బహిరంగ మద్యపానం చేసే వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

● నూజివీడు: పట్టణంలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 8 మందిని పట్టణ సీఐ పి.సత్యశ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. సీఐ సత్య శ్రీనివాస్ రాత్రి పూట గస్తీ తిరుగుతుండగా బహిరంగంగా మద్యం సేవిస్తూ వీరంతా పట్టుబడ్డారు. వీరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

భోజనం.. భారం

- మధ్యాహ్న భోజనానికి ధరల సెగ
- మండుతున్న నిత్యావసర వస్తువుల ధరలు
- ఏజెన్సీలకు భారంగా మారిన నిర్వహణ



నూజివీడు పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

నూజివీడు: నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. టీడీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఇదే పరిస్థితి. పెరిగిన ధరలతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం ఇచ్చే మెనూ చార్జీల కంటే నిర్వాహకులకు అవుతున్న ఖర్చు ఎక్కువగా ఉంటోంది. మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు నష్టాలను భరిస్తూ విద్యార్థులకు వండి పెడుతున్నారు.

రెండు నెలలుగా బిల్లుల బకాయిలు

ధరల మోతతోపాటు రెండు నెలలుగా మధ్యాహ్న భోజన పథకం బిల్లులు రాకపోవడంతో నిర్వాహకులు అప్పు చేసి ఏజెన్సీలను నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలకు ఏ నెల బిల్లులు ఆ నెలే చెల్లించేవారు. ఇప్పుడు పరిస్థితి అందుకు విరుద్ధంగా తయారైంది.

ప్రభుత్వం చెల్లిస్తున్న మెనూ చార్జీలు ..

ప్రస్తుతం నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం మెనూ చార్జీలు ఇలా ఉన్నాయి. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఒక్కొక్క విద్యార్థికి రూ.5.88, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ.8.57 ప్రభుత్వం నిర్వాహకులకు చెల్లిస్తోంది. గత ఐదు సంవత్సరాలుగా మెనూ చార్జీలు పెంచలేదు. కూటమి ప్రభుత్వ పాలన ప్రారంభమైన నాటి నుంచి నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగు నెలలు గడిచినా ఇంత వరకు మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు సంబంధించి మెనూ చార్జీలు పెంచలేదు. ధరలు పెరగడం వలన ఏజెన్సీ నిర్వాహకులకు ఖర్చు పెరిగిపోవడంతో కొన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో నాణ్యత తగ్గింది. దీంతో విద్యార్థులకు గతంలో మాదిరిగా పౌష్టికాహారం అందే పరిస్థితి లేదు.

నిత్యావసర వస్తువుల ధరలు

వస్తువులు	జూలైలో (కిలో రూ.లలో)	ప్రస్తుతం
సన్‌ఫ్లవర్ నూనె	112	140
పామాయిల్	90	120
వెల్లుల్లి	250	400
ఉల్లిపాయలు	30	50
కందిపప్పు	165	180
ఎండుమిర్చి	180	200

నియోజకవర్గంలో పాఠశాలల వివరాలు

మండలం	మొత్తం ప్రభుత్వ పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
నూజివీడు	93	7825
ఆగిరిపల్లి	50	3910
ముసునూరు	62	3728
చాట్రాయి	63	2962

మెనూ ఇలా...

సోమవారం : హాట్‌పొంగల్, ఉడికించిన కోడిగుడ్డు/ కూరగాయల పలావ్, గుడ్డుకూర, వేరుశనగ చిక్కీ,

మంగళవారం : పులిహోర, టమోట పచ్చడి/ రాగిజావ, దొండకాయ పచ్చడి, ఉడికించిన కోడిగుడ్డు.

బుధవారం : కూరగాయల అన్నం, బంగాళదుంప కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ విద్యార్థులకు పెట్టాల్సి ఉంది.

గురువారం : నిమ్మకాయ పులిహోర, సాంబార్ బాత్, ఉడికించిన గుడ్డు, రాగి జావ

శుక్రవారం : అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ

శనివారం : ఆకుకూర అన్నం, పప్పుచారు, తీపి పొంగలి, రాగి జావ వంటి పెడతారు.

ధరలు బాగా పెరిగాయి



కూరగాయల ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు బాగా పెరగడంతో ఏజెన్సీ నిర్వహణ కష్టంగా ఉంది. ఏ కూరగాయలు చూసినా కిలో రూ.50కి పైనే ఉంది. కందిపప్పు, వంటనూనెలు తదితర వస్తువుల ధరలు పెరిగాయి. ప్రభుత్వం మా బాధలు అర్థం చేసుకుని మెనూ చార్జీలు పెంచాలి.

– శెట్టిపల్లి రంగబాబు, ఏజెన్సీ నిర్వాహకుడు, నూజివీడు

మెనూ చార్జీలు పెంచాలి



కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ భారంగా మారింది. అన్ని రకాల వస్తువుల ధరలు పెరగడంతో ప్రభుత్వం ఇచ్చే మెనూ చార్జీలు చాలక చేతిలో డబ్బులు పడుతున్నాయి. ప్రభుత్వం మెనూ చార్జీలు పెంచి ఆదుకోవాలి.

– లటికే పద్మావతి, ఏజెన్సీ నిర్వాహకురాలు, నూజివీడు

సమన్వయంతో మండల అభివృద్ధి

ఎమ్మెల్యే శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

విస్సన్నపేట: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడపాలని ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సాధారణ సమావేశం ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అధ్యక్షతన వెలుగు కార్యాలయం మీటింగ్‌హాల్‌లో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే పథకాలపై దృష్టి పెట్టామన్నారు. మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయా శాఖాధికారులు వివరించారు. జగనన్న కాలనీని అభివృద్ధి చేయాలని, కొంతమంది అధికారులు అందుబాటులో ఉండటం లేదని, ఎస్సీ శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని ఎంపీటీసీ సభ్యుడు జి. మల్లయ్య కోరారు. ఎంపీడీఓ చేకు చిన్నరాట్నాలు, వైస్ ఎంపీపీలు గాజుల శ్రీనివాసరావు, రెడ్డి వెంకట శ్రీనివాసరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే స్థానిక గంగా పార్వతి సమేత చంద్రశేఖరస్వామి దేవస్థానంలో కార్తికమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక సీహెచ్‌సీలో హాస్పటల్ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

బాలల హక్కులు, చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జాన్సన్

జి.కొండూరు: బాలల భద్రత అందరి బాధ్యత అని సీడీపీఓ పుష్పలత అన్నారు. బాలల హక్కులు, చట్టాలపై ఎంఎస్‌కేలు, వీఓఎలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బందికి జి.కొండూరు కమ్యూనిటీ హాల్‌లో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన తహసీల్దార్ సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ రామకృష్ణ నాయక్, ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రొటెక్షన్ స్కీమ్ ప్రతినిధులు వై. జాన్సన్, ఎం. జీవన్‌కుమార్ మాట్లాడుతూ బాలల రక్షణకు చేపట్టవలసిన అంశాలను వివరించారు. బాల్య వివాహాల నిర్మూలన, చిన్నారులపై జరుగుతున్న దాడులను అరికట్టే విధానం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించడం, దాడులు జరిగిన సమయంలో సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు, హక్కులు, చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

● ఇబ్రహీంపట్నం: బాలల చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ ప్రొటెక్షన్ సంస్థ ప్రతినిధి వై. జాన్సన్ అన్నారు. ఇబ్రహీంపట్నం వెలుగు కార్యాలయంలో సీడీపీఓ కె. పుష్పలత అధ్యక్షతన బాలల చట్టాలు, కిశోరి వికాసం, బేటీ బచావో బేటీ పడావో చట్టాలపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. జాన్సన్, జీవన్ కుమార్ మాట్లాడుతూ బాలల పరిరక్షణ, వారి హక్కులను వివరించారు. లింగ వివక్షత, పోక్సో చట్టాలపై సీడీపీఓ పుష్పలత మాట్లాడారు. మానవ అక్రమ రవాణా నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ జి. రమాదేవి, వాసవ్య మహిళా మండలి సభ్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశాలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

టీటీడీ కమిటీలో ముస్లింలకు అవకాశం కల్పించాలి

మహ్మద్ అల్తాఫ్‌రజా డిమాండ్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి కమిటీలో ముస్లిం మైనార్టీలకు స్థానం కల్పించాలని అహలే సున్నత్ జమాత్ సంస్థ రాష్ట్ర కో కన్వీనర్ మహ్మద్ అల్తాఫ్‌రజా డిమాండ్ చేశారు. కొండపల్లి షాబూఖారీ దర్గాలో బుధవారం ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బోర్డులో హిందువులకు అవకాశం ఉన్నప్పుడు టీటీడీలో ముస్లింలకు ఎందుకు అవకాశం ఇవ్వరని ప్రశ్నించారు. శ్రీ వెంకటేశ్వరస్వామి 700 ఏళ్ల క్రితమే ముస్లిం మహిళ బీబీ నాంచారమ్మను వివాహమాడిన విషయం గుర్తు చేశారు. భద్రాచలం ఆలయానికి హైదరాబాద్ నవాబులు పూర్వం నుంచి ఇప్పటివరకు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించడం నిజం కాదా అని ప్రశ్నించారు. శ్రీరామ భక్తుడు కబీర్‌దాస్ చరిత్ర ఒకసారి తిరగేయాలని సూచించారు. స్వయాన హిందూ దేవుళ్లు ముస్లింలను చేరదీశారన్నారు. టీటీడీ కమిటీలో ముస్లిం మైనార్టీలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ అవకాశం కల్పించాలని కోరారు. దీనిపై త్వరలో ప్రధాని మోదీ, అమిత్‌షాలను కలుస్తామని చెప్పారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

నూజివీడు: మండలంలోని యనమదల జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు బేస్ బాల్, సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం ఎస్.నాగరాజు బుధవారం తెలిపారు. ఇటీవల కృష్ణా జిల్లా గన్నవరం బాయ్స్ హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. సాఫ్ట్‌బాల్‌కు పదో తరగతి విద్యార్థులు సీహెచ్ సుశాంత్, జి.సుబ్బరాజు, డి.హేమశ్రీ (8వ తరగతి), బేస్‌బాల్‌కు 8వ తరగతికి విద్యార్థులు ఎం.ప్రేమ్‌కుమార్, వి.రిషిత, ఎం.మున్నా (10వ తరగతి) ఎంపికయ్యారని చెప్పారు. వీరు గుంటూరు, చిత్తూరు, ఆనందపురం, తిరుపతి జిల్లాలలో జరుగనున్న రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌లో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను పలువురు అభినందించారు.

బాలికల ఎంపిక ..



రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపికైన తిరువూరు విద్యార్థినులు

తిరువూరు: ఉమ్మడి కృష్ణాజిల్లా 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గన్నవరం బాలుర పాఠశాలలో ఈ నెల 5న నిర్వహించిన సాఫ్ట్‌బాల్, బేస్ బాల్ పోటీల్లో తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. అండర్ 17 బేస్ బాల్ విభాగంలో పాఠశాల విద్యార్థిని మౌనశ్రీ, అండర్ 17 విభాగం సాఫ్ట్‌బాల్‌లో కావ్యశ్రీ, అండర్ 14 విభాగంలో ఎం. మయూరి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు పీఎస్ఎన్ రాజు తెలిపారు. విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన పీఈటీ సుకన్యను ఆయన అభినందించారు.

గండ్లు పూడ్చితేనే దాళ్వా సాగు

'పొలం పిలుస్తోంది'లో రైతులు

విజయవాడరూరల్: బుడమేరు వరదల్లో గద్దె కాల్వకు, తారకరామ ఎత్తిపోతల పథకం కాల్వకు పడిన గండ్లు పూడ్చితేనే దాళ్వా సాగు ఉంటుందని, లేకపోతే ఉండదని జక్కంపూడి గ్రామ రైతులు తేల్చి చెప్పారు. బుధవారం జక్కంపూడి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి రంగనాథ్‌బాబు మాట్లాడుతూ దాళ్వాలో పంటలు సాగు చేసే వివరాలను అడగ్గా రైతులు గండ్లు పూడ్చితేనే దాళ్వా సాగు ఉంటుందని స్పష్టం చేశారు. ఇరిగేషన్ ఏఈతో వ్యవసాయ శాఖ ఏఓ ఫోన్‌లో మాట్లాడగా దాళ్వా సీజన్‌కు సాగునీరు ఇవ్వడం సాధ్యం కాకపోవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో రైతులు జమలయ్య, మాధవరావు, వెంకట్రావ్, గంధం శివ, మణికంఠ, వ్యవసాయ సహాయకురాలు ఫణిశ్రీ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర

ఎ.కొండూరు: రైతులు ప్రభుత్వం కొనుగోలు కేంద్రంలో కనీస మద్దతు ధరకు ధాన్యం అమ్ముకోవచ్చని మండల వ్యవసాయాధికారి టిప్పు సుల్తాన్ అన్నారు. కంభంపాడు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంబంధిత రైతు సేవా కేంద్రం సిబ్బందికి తెలియజేస్తే, సిబ్బంది షెడ్యూలింగ్ ఇస్తారన్నారు. పీపీసీ టెక్నికల్ అసిస్టెంట్ తేమ శాతం, కనీస నాణ్యతా ప్రమాణాలు చూస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌కే సిబ్బంది ఎం. తిరుపతమ్మ, రైతులు పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): సామాజిక వేడుక కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త జి. ధనలక్ష్మి, వైద్య సిబ్బంది మాట్లాడుతూ పిల్లలకు తల్లిపాలతో పాటు ద్రవ రూపంలో అదనపు ఆహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో గర్భవతులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు, ప్రీస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ముద్దాయిలకు ఎక్సైజ్ అధికారుల కౌన్సెలింగ్

మైలవరం: మైలవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గత 15 రోజులలో పెట్టిన కేసుల్లోని ముద్దాయిలకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జె. శ్రీనివాస్ తెలిపారు. తిరిగి ఇటువంటి నేరాలకు పాల్పడవద్దని వారిని హెచ్చరించామన్నారు. కౌన్సెలింగ్ అనంతరం ఆయా మండలాల తహసీల్దార్ల వద్ద బైండోవర్ చేశామని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముసునూరు: రమణక్కపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని అక్కిరెడ్డిగూడెం, రమణక్కపేట, సూరేపల్లి, గొల్లగూడెం గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని జేఈ కేవీ సుబ్బారావు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ త్రీఫేజ్ విద్యుత్ సరఫరా యథావిధిగా తెల్లవారు జాము 4 నుంచి ఉదయం 10 గంటల వరకు ఉంటుందన్నారు. అనంతరం మధ్యాహ్నం నుంచి సరఫరా నిలుపుదల చేస్తామని చెప్పారు.

అయ్యా.. రక్షణ కల్పించండి!

- మైలవరం నియోజకవర్గంలో దొంగల హల్‌చల్
- బైకుపై వచ్చి చైన్‌లు, సెల్‌ఫోన్ల చోరీలు
- ఆందోళనలో గ్రామస్తులు

జి.కొండూరు: మైలవరం నియోజకవర్గంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. పోలీసులకే సవాల్ విసురుతూ వరుస చోరీలకు పాల్పడుతున్నారు. బైకుపై వచ్చి చైన్ స్నాచింగ్‌లు, సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్తున్నారు. ఒంటరిగా మహిళలు రహదారులపైకి రావాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. దొంగలతో జాగ్రత్తగా ఉండాలంటూ పోలీసులే హెచ్చరిక వాల్ పోస్టర్లను అంటించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని చోరీ ఘటనలలో పోలీసులు కేసులు నమోదు చేయకుండా వదిలేస్తున్నారని బాధితులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.



ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ జి.కొండూరు పోలీసులు గోడలపై అంటించి వాల్‌పోస్టరు

వినూత్నంగా చోరీలు..

మైలవరం నియోజకవర్గంలో ఇటీవల చోరీలు జరుగుతున్న తీరు స్థానిక ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై రహదారిపై పడిపోయినట్లు నటించడం, సాయం చేయడానికి వచ్చిన వ్యక్తుల నుంచి సెల్‌ఫోన్‌లను చోరీ చేయడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. రహదారులపై నడిచి వెళ్తున్న మహిళలు, బైకులపై వెళ్తున్న మహిళల మెడలో బంగారు చైన్‌లను చోరీ చేయడం విస్మయానికి గురిచేస్తోంది. బైకుపై వచ్చిన వ్యక్తులే చోరీలు చేస్తున్న క్రమంలో నిందితులంతా ఒక్కటే అనే భావన కలుగుతోంది.

ఇటీవల జరిగిన చోరీల వివరాలు..

● మైలవరం నియోజకవర్గం విజయవాడరూరల్ మండల పరిధి కొత్తూరుకు చెందిన వీరంకి వెంకాయమ్మ బుధవారం ఉదయం తన కుటుంబ సభ్యులతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా జి.కొండూరు మండల పరిధి గడ్డమణుగు గ్రామ శివారులో బైకుపై వచ్చిన వ్యక్తి, వెంకాయమ్మ మెడలో ఉన్న మూడు కాసుల బంగారు చైనును చోరీ చేశాడు.

● జి.కొండూరు మండల పరిధి చెవుటూరు గ్రామ శివారులో సెప్టెంబర్ 28న రహదారిపై ప్రమాదం జరిగినట్లు సృష్టించిన ఇద్దరు దొంగలు, సాయం చేయడానికి వచ్చిన వెంకటాపురం గ్రామానికి చెందిన దొంతిరెడ్డి పాపిరెడ్డి సెల్‌ఫోన్‌ను చోరీ చేశారు. ఆ తర్వాతి రోజు ఆ సెల్‌ఫోన్‌లోని ఫోన్‌పే యాప్ ద్వారా రూ.17 వేలను సైతం విత్‌డ్రా చేశారు. అదే రోజు జి.కొండూరు ఎల్ఎంఆర్ ఆస్పత్రి రోడ్డులో మరో వ్యక్తి సెల్ ఫోన్‌ను ఇదే రీతిలో చోరీ చేసినట్లు తెలిసింది.

● సెప్టెంబరు 29న రెడ్డిగూడెం గ్రామ శివారులో నివాసం ఉంటున్న గుదిబండ నర్సమ్మ మెడలో బంగారు చైనును చోరీ చేసేందుకు బైకుపై వచ్చిన ఇద్దరు దుండగులు ప్రయత్నం చేసి విఫలమయ్యారు. ఆ తర్వాత అదే రోజు గ్రామంలో ద్విచక్ర వాహనాన్ని సైతం చోరీ చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు.

● ఆగస్టు 5న రెడ్డిగూడెం మండల పరిధిలోని అన్నేరావుపేట శివారు గ్రామం సీతారాంపురానికి చెందిన తన్నీరు శాంతి మెడలో మూడు కాసుల బంగారు చైనును దుండగులు ఎత్తుకెళ్లారు. ఇదే రోజు ఎ. కొండూరు మండల పరిధి కోమటి కుంట వద్ద చైన్ స్నాచింగ్ జరిగినట్లు తెలిసింది.

సాయం చేయడానికి వెళ్తే చోరీ చేశారు



చెవుటూరు గ్రామ శివారులో ఇద్దరు దొంగలు రోడ్డుపై పడిపోయినట్లు నటించారు. సాయం చేయడానికి వెళ్లినందుకు నా సెల్ ఫోన్‌ను ఎత్తుకెళ్లారు. ఎత్తుకెళ్లిన నా ఫోన్‌లో ఫోన్‌పే యాప్ ద్వారా రూ.17 వేలు విత్‌డ్రా చేశారు. జి.కొండూరు పోలీసులకు ఫిర్యాదు చేశా. ఇంత వరకు ఎటువంటి పురోగతి లేదు.

– దొంతిరెడ్డి పాపిరెడ్డి, వెంకటాపురం గ్రామస్తుడు

మహిళ మెడలో బంగారు చైను చోరీ

జి.కొండూరు: ద్విచక్ర వాహనంపై వెళుతున్న మహిళ మెడలో బంగారు చైన్‌ను చోరీ చేసిన ఘటన గడ్డమణుగు గ్రామ శివారులో బుధవారం ఉదయం జరిగింది. ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..విజయవాడ రూరల్ మండల పరిధి కొత్తూరుకు చెందిన వీరంకి వెంకాయమ్మ తన కుటుంబ సభ్యులు వీరంకి శ్రీనివాసరావు, రేవతితో కలిసి వీర్లపాడు మండల పరిధి అల్లూరు గ్రామంలో గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై బుధవారం ఉదయం బయలు దేరారు. జి.కొండూరు మండల పరిధి గడ్డమణుగు గ్రామ శివారులోకి రాగానే ఉదయం 7.45 గంటల సమయంలో వెనక నుంచి బైకుపై వచ్చిన వ్యక్తి వెంకాయమ్మ మెడలోని మూడు కాసుల బంగారు చైన్‌ను లాక్కొని పరారయ్యాడు. బాధితురాలు వెంకాయమ్మ జి.కొండూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేయాలి

తిరువూరు: విద్యార్థులకు గతంలో జారీ చేసిన ఆధార్ కార్డుల్లో తప్పులు సవరణ చేయడానికి, అప్‌డేట్ చేయడానికి తిరువూరు మండలంలోని గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారని జన విజ్ఞాన వేదిక ప్రతినిధి రాంప్రదీప్ ఎంపీడీఓ రవిబాబుకు తెలిపారు. బుధవారం ఎంపీడీఓను కలిసి ఆధార్ కార్డుల్లో సవరణల కోసం విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. అపార్ కార్డుల జారీకి ఆధార్ డేటా ప్రామాణికమైనందున పాఠశాలల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.

ఎల్బీఆర్సీఈ విద్యార్థుల ఇంటింటి సర్వే

మొర్సుమల్లి(మైలవరం): ఇంటింటి సర్వే, గ్రామ సర్వే కార్యక్రమాన్ని మండలంలోని మొర్సుమల్లి గ్రామంలో విద్యార్థులు బుధవారం నిర్వహించారని మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రమేష్ రెడ్డి బుధవారం తెలిపారు. ఈ సర్వేలో కుటుంబం యొక్క విద్య, వ్యాపార, వ్యవసాయ, జీవనాధార సమాచారం సేకరించామన్నారు. గ్రామంలోని సమస్యలు తెలుసుకుని, ఈ సమాచారం ఉన్నత భారత్ అభియాన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి, ఉన్నత భారత్ అభియాన్ కో–ఆర్డినేటర్ డాక్టర్ బి. శివహరిప్రసాద్, ప్రోగ్రాం ఇన్‌చార్జి అధికారి ఎల్. నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.